క్లుప్తంగా

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

జీవీఎంసీ పారిశుధ్య కార్మికుల సంతాప సభ



పారిశుధ్య కార్మికులకు నివాళులర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్, సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు గుర్రాల రత్నం, జోగా పైడితల్లి సంతాప కార్యక్రమం శుక్రవారం స్వామి వివేకానంద సంస్థ నిర్వహించింది. వారి చిత్రపటాల వద్ద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ మాట్లాడుతూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జీవీఎంసీ సిబ్బంది నిరంతరం పరిశుభ్రత కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషిస్తూ, అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తూ ఇటు సంస్థ సేవలో పాల్గొంటూ సంస్థకు అనుబంధంగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంస్థ ట్యూషన్ పిల్లలు భగవద్గీత శ్లోకాలు పఠించారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు అప్పలకొండ, పైడిరాజు, మహిళా సభ్యులు, చనిపోయిన గుర్రాల రత్నం, పైడితల్లి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వాసుపల్లి చొరవతో వృద్ధురాలికి ఆశ్రయం



వృద్ధురాలిని సేవా సంస్థ ప్రతినిధి అప్పారావుకు అప్పగిస్తున్న ముజీబ్‌ఖాన్

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చొరవతో వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. ఆశీలమెట్ట కార్యాలయం సమీపంలో అనాథగా జీవిస్తున్న వృద్ధురాలు వాసుపల్లి సహకారం కోరడంతో స్పందించిన ఆయన 39వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్‌తో వన్‌టౌన్ ప్రాంతంలో గల శ్రీ వివేకానంద స్వచ్ఛంద సంస్థలో ఆశ్రయం కల్పించారు.

పది ఫలితాల్లో ఆలివెట్ విద్యార్థుల ప్రతిభ



భరత్ మంజుభార్గవి

డాబాగార్డెన్స్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా పరిషత్ సమీపాన గల ఆలివెట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 580 మార్కులతో మంజుభార్గవి, ఎస్. భరత్ పాఠశాల టాపర్లుగా నిలిచారు. పరీక్షకు హాజరైన 50 మంది విద్యార్థుల్లో 22 మంది విద్యార్థులు 500కు పైబడి మార్కులు సాధించారని స్కూల్ డైరెక్టర్ షీలా జాక్సన్ తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇంతటి విజయం సాధించినట్టు చెప్పారు.

వేసవి తాపం.. తాటిముంజలతో ఉపశమనం

- జోరుగా సాగుతున్న విక్రయాలు
- ఆసక్తిగా కొనుగోలు చేస్తున్న ప్రజలు
- చిరు వ్యాపారులకు చక్కని ఉపాధి





తాటికాయల్లో నుంచి ముంజలు తీస్తున్న వ్యాపారులు



తాటిముంజలు కొనుగోలు చేస్తున్న నగర వాసులు

డాబాగార్డెన్స్: మండుటెండల్లో తక్షణమే శరీరానికి చల్లదనం ప్రసాదించే తాటిముంజల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి ఏటా వేసవిలో ఇవి విరివిగా పండుతాయి. ధర తక్కువగా ఉండడం, రుచితో పాటు చల్లదనం, ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి మాదిరిగానే తాటి ముంజలు కూడా మానవాళికి ఎంతో మేలు చేస్తాయి. తాటిచెట్లకు ప్రత్యేకించి తోటలంటూ ఏమీ ఉండవు. పొలాల గట్లపైన, ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఇవి తారసపడతాయి. పేద, చిరు విక్రయదారులకు అంతో ఇంతో ఉపాధి అందిస్తున్నాయి తాటి ముంజలు. తాటి చెట్ల నుంచి తాటి ముంజలు సేకరించి, వాటిని నగరంలోని పలు ప్రధాన రహదారుల వద్ద విక్రయిస్తున్నారు. వేసవిలో వీటికి డిమాండ్ అధికంగా ఉండడంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి.

పలు ప్రాంతాల నుంచి నగరానికి..

సింహాచలం, పెందుర్తి, ఆరిలోవ, మధురవాడ, విజయనగరం జిల్లా కొత్తవలస, కొత్తూరు, కంటకాపల్లి, భీమసింగి, అలమండ, జామి తదితర ప్రాంతాల్లో లభ్యమయ్యే తాటి ముంజలు అత్యంత రుచిగా ఉంటాయని ప్రతీతి. దీంతో ఆయా ప్రాంతాల వ్యాపారులు అల్లిపురం, పూర్ణామార్కెట్, రామకృష్ణా రైతు మార్కెట్, కురుపాం మార్కెట్, పాత నగరం కోటవీధి, పాతపోస్టాఫీస్, రెల్లివీధి, గొల్లలపాలెం, చెంగల్రావుపేట తదితర ప్రాంతాలతో పాటు వీధి వీధిన గంపలతో విక్రయాలు సాగిస్తున్నారు. మరో వైపు వివిధ గ్రామాల్లో తాటి ముంజులకు పెద్దగా ధరలు ఉండే అవకాశం లేకపోవడం, నగరంలో అయితే మంచి లాభాలు వచ్చే అవకాశం ఉండడంతో పాటు, వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ ఉండడంతో వివిధ గ్రామాలకు చెందిన వారు ప్రత్యేకించి విశాఖ నగరానికి వచ్చి తాటిముంజల అమ్మకాలు సాగిస్తున్నారు. ఓ వైపు మామిడి పండ్లు, కొబ్బరికాయలు, ఖర్బూజకు దీటుగా వేసవిలో తాటిముంజల విక్రయాలు సాగుతున్నాయి. ఇవి డజన్ రూ.40 నుంచి రూ.50కి విక్రయిస్తున్నారు.

'హలో బేబీ' చిత్రం అందరికీ నచ్చుతుంది



చిత్ర దర్శకుడు రత్నం రామ్‌గోపాల్‌తో సత్తివాడ శ్రీకాంత్, సత్యాడ నర్సింగరావు

డాబాగార్డెన్స్: నగరానికి చెందిన యువ దర్శకుడు రత్నం రామ్‌గోపాల్ దర్శకత్వంలో కాండ్రేగుల ఆదినారాయణ నిర్మాణ సారథ్యంలో రూపొందించిన 'హలో బేబీ' చిత్రం శుక్రవారం చిత్రాలయలో విడుదలయింది. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ కవి, రచయిత సత్తివాడ శ్రీకాంత్ దర్శకుడు రత్నం రాంగోపాల్‌ను సత్కరించారు. శ్రీకాంత్ మాట్లాడుతూ ఇండియన్ ఫస్ట్ సోల్ క్యారెక్టర్ హ్యాకింగ్ మూవీగా ఈ చిత్రం విజయవంతం కానుందని, సున్నితమైన కథాంశంతో ఒకే ఒక్క పాత్రతో ఈ చిత్రాన్ని దర్శకుడు మలిచిన తీరు అద్భుతంగా ఉందన్నారు. చిత్ర దర్శకుడు రత్నం రామ్‌గోపాల్ మాట్లాడుతూ విభిన్నమైన చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారన్నారు. విడుదలకు ముందే 3 ప్రతిష్టాత్మక అవార్డులు ఈ చిత్రం కైవసం చేసుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత ఆదినారాయణ, రచయిత సత్యాడ నర్సింగరావు, సిద్దు, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

మలేరియా రహిత సమాజం నిర్మిద్దాం



దొండపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి షారోన్, సిబ్బంది



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు

సీతమ్మధార: మలేరియా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ వద్ద జరిగిన అవగాహన ర్యాలీ, ఎగ్జిబిషన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సిబ్బంది కృషితో 2023 కంటే 2024లో మలేరియా పాజిటివ్ కేసుల ఉధృతి తగ్గిందని 2025లో మలేరియా కేసుల సంఖ్య మరింత నియంత్రించాలని కోరారు. ఇందుకు ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని కలిసికట్టుగా పని చేయాలన్నారు. ప్రజలను మలేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ కేవీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ మన జనరేషన్‌తోనే మలేరియా అంతం కావాలని, మలేరియా నియంత్రణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి 2027 నాటికి మలేరియాను నిర్మూలించే దిశగా ప్రతి ఒక్కరు శ్రమించాలన్నారు. జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి మాట్లాడుతూ నీటి నిల్వలు లేకుండా వారానికి ఒకరోజు శుభ్రపరిచేలా చూడాలన్నారు. ఏఎంవోహెచ్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ మలేరియాపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మలేరియా జ్వరాన్ని వ్యాప్తి చేసే దోమలు పెరిగే ప్రదేశాలు, వాటి నిర్మూలనకు ఉపయోగించే కెమికల్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. అనంతరం మనతోనే మలేరియా అంతం అంటూ నినాదాలతో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా జోనల్ కార్యాలయ సిబ్బంది, సబ్ యూనిట్ కార్యాలయం సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

దొండపర్తి అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో..

దోమకాటు వల్ల వచ్చే మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దొండపర్తి అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి షారోన్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం దొండపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మలేరియా నియంత్రణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలన్నారు. వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎస్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు అరుణ కుమారి, ల్యాబ్ టెక్నీషియన్ ఐజాక్, మలేరియా సూపర్‌వైజర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–2 పరిధి 5, 6, 7, 8 వార్డుల పరిధిలో గల పలు ప్రాంతాలకు తాగునీటి అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోన్–2 పరిధి 5, 6, 7, 8 వార్డుల పరిధిలో తాగునీటిని సరఫరా చేసే ప్రధాన వనరు గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్ లైన్ పంప్ హౌస్ వద్ద, మారికవలస మెట్రో హోల్ సేల్ ఎదురుగా లీకులకు గురి కావడం వల్ల మరమ్మతుల కారణంగా శనివారం నీటి పంపింగ్ జరగదని తెలిపారు. 5వ వార్డు బోరవానిపాలెం, సాయిరాంకాలనీ, 6వ వార్డు కొమ్మాది విలేజీ, ఎంఎస్‌ఆర్ లే అవుట్, సాయి ప్రియ లే అవుట్, సంపత్ నగర్, లక్ష్మీవానిపాలెం, ఎస్సీ కాలనీ, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, పీఎం పాలెం, అశోక్‌నగర్, తులసీనగర్, 7వ వార్డు పరిధి చంద్రంపాలెం, కళానగర్, కృష్ణానగర్, ఎన్‌జీవోస్ కాలనీ, 8వ వార్డు పరిధి మిథిలాపురి వుడా కాలనీ, పాత మధురవాడ, ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ, షిప్‌యార్డ్ లే అవుట్, బింద్రానగర్, తారకరామనగర్, చాణిక్యపురి లే అవుట్, పియర్‌లెస్ కాలనీ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయడం ఏర్పడనుందన్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉగ్రదాడి సిగ్గుచేటు



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు, యూనియన్ల ప్రతినిధులు



డాక్టర్ రియాజ్ అహ్మద్

డాబాగార్డెన్స్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి కిరాతకమైన చర్య అని, ఈ దాడిని సభ్య సమాజం తీవ్రంగా ఖండిస్తోందని ఎల్ఐసీ ఉద్యోగులు తెలిపారు. ఇటువంటి దుశ్చర్యలను ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించాలన్నారు. ఈ ఘటనలో ఎల్ఐసీకి చెందిన మేనేజర్, ఒక ఏజెంట్ కూడా ఉన్నారని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని అణిచివేయాలని, ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో ఉద్యోగులు, ఏజెంట్లు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షురాలు ఎం. కామేశ్వరి, కార్యదర్శులు త్రినాథ్, సత్యం బాబు, ఎల్ఐసీ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కె. రవికుమార్, ఐసీఆర్ఈఏ నాయకుడు బీబీ గణేష్, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదరం, కార్యదర్శి గణపతిరావు, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్, కార్యదర్శి హరనాథ్, ఏజెంట్ల సంఘం నాయకులు నాగరాజు, ఠాగూర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడి హేయం..

అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి హేయమని ప్రముఖ హోమియోపతి వైద్యుడు డాక్టర్ రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలో 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దుఃఖాన్ని కల్గించిందని, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని కోరారు. నేరస్తులను త్వరగా గుర్తించి, చట్టం ముందుకు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పూజలు చేస్తున్న వెంకట అప్పలనాయుడు, బొడ్డేటి ప్రసాద్ తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు సాయిబాబా వీధిలో వెలసిన షిర్డీ సాయిబాబా దేవాలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బాబాకు పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం సాయిబాబాని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం చేపట్టిన నారాయణ సేవలో ఆలయ వ్యవస్థాపకులు పీల వెంకట అప్పలనాయుడు పాల్గొని అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం కార్యవర్గ సభ్యులు బొడ్డు పోలారావు, సత్యనారాయణ, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులోని కోర్టు–2లో నిర్వహించిన పైడిరాజు మెమోరియల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతలుగా ప్రసాద్, మహేష్ జట్లు.. రన్నర్స్‌గా ఎం.రంగారెడ్డి, నాగభూషణరావు జట్లు నిలిచాయి. గ్రౌండ్లో ఉన్న మూడు షటిల్ కోర్టుల ఆటగాళ్లతోపాటు కొత్త వెంకోజీపాలేనికి చెందిన గణేష్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆటగాళ్లు పాల్గొని ప్రతిభ చూపారు. 15 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి గురువారం లీగ్ మ్యాచ్‌లు ఆడించారు. శుక్రవారం సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించి, విజేతలకు ట్రోఫీలు, జ్ఞాపికలు బహూకరించారు. ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని పైడిరాజు జ్ఞాపకార్థం కేక్ కట్‌చేశారు. పైడిరాజు స్ఫూర్తితో ఆటగాళ్లందరూ రాణించాలని ఆకాంక్షించారు. విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఆటగాడికి మెడల్స్‌ను అప్పారావు అందజేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ తమ గురువు పైడిరాజు గతేడాది అకాల మరణం పొందారని, ఆయన నేర్పిన విద్యతో తాము ప్రతి రోజూ షటిల్ ఆటను కొనసాగిస్తున్నామన్నారు. నిర్వాహకులు పల్లా శ్రీను, పల్లా శివ, ప్రసాద్, ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావు, శ్రీను, హరీష్, వంశీ, చిన్న, పల్లా ప్రసన్న, మహేష్, మణి, జనసేన నాయకుడు పీలా వెంకట పరదేశినాయుడు, శ్రీరాధాకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు పాల్గొన్నారు.

8న బల్లిగిరి వెంకన్న కల్యాణోత్సవం



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం మే 8వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ నెల 30న కల్యాణ రాట, 7న అంకురార్పణ, 13న పుష్పాంజలి సేవతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. పాల్గొనదలిచిన భక్తులు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. 7వ తేదీ ఉదయం పంచామృతాభిషేకాలు, స్నపనం, తిరుమంజన సేవ, నూతన వస్త్రాలంకరణ, సాయంత్రం ఉత్సవ సంకల్పం, ఆరాధన, నివేదన, ఉత్సవ సంకల్పం ఉంటాయన్నారు. 8వ తేదీన ధ్వజారోహణం, రాజభోగం, నివేదన, సాయంత్రం స్వామి వారి తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు. 10వ తేదీన హోమాలు, 12వ తేదీన వైశాఖ పూర్ణిమ సందర్భంగా శేషహోమం, పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, సాయంత్రం ధ్వజావరోహణం, సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్రహారతి, సప్తహారతి ఉంటాయన్నారు. 13వ తేదీ సాయంత్రం శ్రీవారి పుష్పాంజలి ఉత్సవం, ఊంజల్ సేవ, పవళింపు సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. పాల్గొనదలచిన భక్తులు దేవస్థానంలో రూ.1,116 చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

మహిళలకు మేలు చేసే ఉపాధి శిక్షణ తరగతులు



ప్రశంసాపత్రాలతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి ఆవరణలోని జ్యోతి నిలయంలో డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ మహిళలకు అందించిన ఉచిత టైలరింగ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ హాజరై మాట్లాడారు. మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ఇలాంటి ఉపాధి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టైలరింగ్ పూర్తి చేసిన మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వేసవిలో చిన్నారులకు మరిన్ని ఉచిత శిక్షణ సేవలు అందించాలని సంస్థ సభ్యులను కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన శిక్షకులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.అరుణ్‌దాస్, ఇగ్నేషియస్, సంస్థ సమన్వయకర్త సిస్టర్ పెర్లే, శిక్షకురాలు అనిత, క్రాంతి, సతీష్, పీఆర్‌వో కోరాడ బాలమణి పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్నహస్తం



షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయితో రుత్‌బగ్



ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో హేమలతతో ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: వివాహం అయి భర్తతో విడిపోయిన ఒడిశా వాసి రుత్ బగ్ (45)కి పిల్లలు లేరు. తల్లి ఉన్నారు. రుత్ బగ్ ఉపాధి కోసం విశాఖపట్నం వచ్చింది. రైల్వేస్టేషన్‌లో ఆమెను గుర్తించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు టీఎస్ఆర్ షెల్టర్ హోంకు ఆమెను తీసుకెళ్లారు. షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి ఆమెకు ఆశ్రయం కల్పించారు.

ఇండోర్ మహిళకు ఆశ్రయం..

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన హేమలత విశాఖ రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గమనించి ఏయూటీడీకి సమాచారం అందించారు. దీంతో కార్యదర్శి ప్రగడ వాసు ఆమెను షెల్టర్ హోంకు తరలించారు. ఆమె తనలో తానే మాట్లాడుకుంటుందని, వెళ్లిపోతానని గొడవ చేస్తోందని షెల్టర్ నిర్వాహకులు తెలిపారు. ఊరు పేరు తప్ప మరేం చెప్పడంలేదన్నారు. సైకియాట్రిస్ట్ డాక్టర్ శ్రావణి ద్వారా చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 11 వినతులు అందాయని సిటీ ప్లానర్ కె. ధనుంజయ్ తెలిపారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

స్పెషల్ ఒలింపిక్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్

విశాఖ విద్య: రాష్ట్రస్థాయిలో సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ నిర్వహించిన స్పెషల్ ఒలింపిక్స్ భారత్–2025 క్రీడా పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఏలూరు జిల్లా నూజివీడు మండలం ఆగిరిపల్లి హిల్ పారడైజ్ స్కూల్‌లో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తాచాటి పలు పతకాలు సాధించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వీరిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ అభినందించారు. సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖరరావు, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి

ఆరిలోవ: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ తోటగరువు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. పాఠశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ తోటగరువు కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని చదువు, నాణ్యమైన విద్య అందిస్తారని తెలిపారు. ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఉత్తమ విద్యకు ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమం అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్సీలో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం

ఎంవీపీకాలనీ: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఈ అంశంపై ఎంవీపీ కాలనీలోని గిరిజన భవన్‌లో శుక్రవారం సమావేశమై చర్చించారు. గిరిజన యువతకు లబ్ధి చేసే జీవో నంబర్ 3ని పునరుద్ధరించడకుండా, ప్రత్యామ్నాయ జీవో కూడా విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. దీంతో అత్యంత వెనుకబడిన గిరిజన కులాల నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. సంఘ అధ్యక్షుడు సోనాయి అప్పలరాజు, కార్యదర్శి శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.